సాక్షి అనంతపురం

మంగళవారం । 3 । డిసెంబర్ । 2024



చీనీ టన్ను రూ.28,400

అనంతపురం మార్కెట్‌యార్డులో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.28,400 పలికాయి.



టమాట కిలో రూ.40

అనంతపురం కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట గరిష్ట ధర రూ.40 పలికింది. కనిష్టం రూ.30, సరాసరి రూ.35 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
29.4°/21.9°

జిల్లా అంతటా సోమవారం తుపాను వాతావరణం కొనసాగింది. చలి తీవ్రత కొంత తగ్గింది. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి.

న్యూస్‌రీల్

బరితెగించిన టీడీపీ గూండాలు



గాయపడిన చిన్న పుల్లారెడ్డి

యాడికి: పూర్వీకుల నుంచి ఇంటి ఎదుట ఉన్న అరుగును ఎందుకు తొలగిస్తున్నారంటూ నిలువరించిన వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులపై టీడీపీ గూండాలు కట్టెలతో దాడి చేశారు. మండలంలోని వేములపాడు గ్రామంలో సోమవారం సాయంత్రం ఈ ఘటన చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన పెద్ద పుల్లారెడ్డి, చిన్న పుల్లారెడ్డి సోదరుల ఇంటి ఎదుట ఉన్న అరుగును గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు చుక్కలూరు రామచంద్రారెడ్డి, జక్కా నారాయణ, కొలిమి షరీఫ్, యాడికి మస్తాన్, బొలికొండ నరసింహ రాజు, చుక్కలూరు అఖిల్‌రెడ్డి సోమవారం సాయంత్రం తొలగించే ప్రయత్నం చేశారు. ఆ సమయంలో పెద్ద పుల్లారెడ్డి, చిన్న పుల్లారెడ్డి నిలువరించే ప్రయత్నం చేశారు. దీంతో రామచంద్రారెడ్డి కట్టెతో చిన్న పుల్లారెడ్డి తలపై కొట్టడంతో రక్త గాయమైంది. ఎడమ కాలు వాచిపోయింది. మిగిలిన వారు పెద్దపుల్లారెడ్డిపై దాడి చేయడంతో మూగ దెబ్బలు తగిలాయి. గమనించిన కుటుంబ సభ్యులు 108 వాహనంలో తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి వైద్యులు రెఫర్ చేశారు.

అప్రెంటిస్‌షిప్ సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు హాజరుకండి

అనంతపురం క్రైం: ఆర్టీసీలో అప్రెంటిస్‌షిప్ కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు కర్నూలులోని ఆర్టీసీ జోనల్ శిక్షణ కళాశాలకు హాజరుకావాలని ఆ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.నజీర్‌అహ్మద్ తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న ఐటీఐ అభ్యర్థులకు ఇప్పటికే సమాచారం అందజేశామని, ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాల్సి ఉంటుందని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 08518 257025లో సంప్రదించాలని కోరారు.

పంపు హౌస్ పనులకు త్వరలో టెండర్లు



ప్రాజెక్ట్ మ్యాపును పరిశీలిస్తున్న మంత్రి కేశవ్

బెళుగుప్ప: హంద్రీ–నీవా ప్రాజెక్టులో భాగంగా కోనాపురం వద్ద పంపు హౌస్ పనులకు త్వరలో టెండర్లను పిలవనున్నట్లు రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. సోమవారం బెళుగుప్ప మండలం కోనాపురంలో ఆయన పర్యటించారు. 11వ పంపు హౌస్ పనులకు సంబంధించి రెవెన్యూ, విద్యుత్, హెచ్ఎన్ఎస్ఎస్ అధికారులతో సమీక్షించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ప్రాధాన్యత పనుల్లో భాగంగా రూ.2.7 కోట్ల నిధులను పాత ప్రతిపాదనల మేరకే విడుదల చేసామన్నారు. కార్యక్రమంలో హెచ్ఎన్ఎస్ఎస్ ఎస్ఈ నాగరాజు, ఈఈ శ్రీనివాస్‌నాయక్, పంపుహౌస్ ఈఈ చంద్రశేఖర్‌రెడ్డి, డీఈలు రమణ, చంద్రశేఖర్, తహసీల్దార్ షర్మిల, ఎంపీడీఓ లక్ష్మీనారాయణ, ఏఓ పృథ్వీసాగర్ తదితరులు పాల్గొన్నారు.

వివాదాల విశ్వరూపం



- తనకు పదోన్నతి కల్పించాలంటూ ఎస్కేయూలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న లక్ష్మీనారాయణ వర్సిటీ పెద్దలకు చాలా రోజుల నుంచి మొరపెట్టుకుంటున్నారు. అయితే, ఎన్ని సార్లు విన్నవించినా పెడచెవిన పెట్టడంతో విసిగి వేసారిన ఆయన ఇటీవల రిజిస్ట్రార్ సమక్షంలోనే పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు యత్నించారు. ఎస్సీ కేటగిరీలో క్లియర్ వేకెన్సీ ఉన్నా అవకాశం కల్పించడం లేదని, సవాలక్ష నిబంధనలలో కొర్రీలు వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.
- కెరీర్ అడ్వాన్స్‌మెంట్ స్కీం (సీఏఎస్) కింద ఆరు నెలలకోసారి వర్సిటీ ప్రొఫెసర్లకు పదోన్నతులు కల్పించాలి. అప్పుడే వారి జీతాలు పెరుగుతాయి. కానీ, ఈ విషయంపై వర్సిటీ పెద్దలు దృష్టి సారించకపోవడంతో ప్రొఫెసర్లు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. ఇవే కాదు, వర్సిటీలో అనేక సమస్యలు తాండవిస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. పైపెచ్చు వర్సిటీని వివాదాలకు కేంద్రబిందువుగా మార్చారు.

- ఎస్కేయూలో పడకేసిన పాలన
- యాజమాన్యం తీరుతో విసిగిపోతున్న ఉద్యోగులు, ప్రొఫెసర్లు
- ఇటీవల ఓ ఉద్యోగి ఆత్మహత్యాయత్నం
- ప్రొఫెసర్లకు పదోన్నతుల కల్పనలోనూ అంతులేని నిర్లక్ష్యం
- సహాయ నిరాకరణ దిశగా ఆచార్యుల అడుగులు

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో పాలన పడకేసింది. రాష్ట్రంలో దాదాపు అన్ని వర్సిటీల్లోనూ సీఏఎస్(కెరీర్ అడ్వాన్స్‌మెంట్ స్కీం) కింద పదోన్నతులు కల్పిస్తున్నా ఎస్కేయూలో మాత్రం మీనమేషాలు లెక్కిస్తున్నారు. సీఏఎస్ పదోన్నతులకు ప్రస్తుతం వర్సిటీలో 15 మంది ప్రొఫెసర్లు నిరీక్షిస్తున్నారు. ఒక్కో దఫా ఐదుగురికి పదోన్నతులు కల్పించాల్సి ఉన్నా వర్సిటీ యాజమాన్యం పట్టించుకోవడం లేదు.

భగ్గుమంటున్న ప్రొఫెసర్లు

వర్సిటీ యాజమాన్యం ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుండటంపై ప్రొఫెసర్లు భగ్గుమంటున్నారు. సీఏఎస్ నిర్వహించకుండా అవమానానికి గురి చేస్తున్నారంటూ మండిపడుతున్నారు. పలు దఫాలు యాజమాన్యానికి వినతి పత్రాలు అందజేసినా పట్టించుకోకపోవడంతో అదనపు పదవులకు మూకుమ్మడిగా రాజీనామా చేసి, సహాయ నిరాకరణ చేయాలని ప్రొఫెసర్లు నిర్ణయించారు. అప్పగించిన పదవులన్నింటినీ త్యజించి, కేవలం పాఠాలు చెబుతూ వర్సిటీ పాలనకు సహకరించకూడదని నిర్ణయించినట్లు తెలిసింది.

రిజిస్ట్రార్ పోస్టుపై వివాదం..

ఇప్పటి దాకా వర్సిటీల చరిత్రలో లేని విధంగా ఎస్కేయూలో ఒక సామాన్య ఉద్యోగికి రిజిస్ట్రార్ పదవిని కట్టబెట్టడంపైనా ప్రొఫెసర్లు గుర్రుగా ఉన్నారు. అసోసియేట్ ప్రొఫెసర్ లేదా డిప్యూటీ రిజిస్ట్రార్ కేడర్‌లో ఉన్న వారికి రిజిస్ట్రార్ పదవి అప్పగించాలని నిబంధనలు స్పష్టం చేస్తున్నా... ఓ రీసెర్చ్ కమ్ స్టాటిస్టికల్ ఆఫీసర్‌ను రిజిస్ట్రార్‌ను చేయడం వివాదాస్పదమైంది. ఈ నేపథ్యంలో వచ్చే పాలక మండలి సమావేశంలో దీనిపై ఫిర్యాదు చేయడానికి ప్రొఫెసర్లు సిద్ధమైనట్లు తెలిసింది. ప్రభుత్వం మాది అని చెప్పుకునే సామాజిక వర్గంవారికి కేటాయించాలని భావిస్తే.. ప్రొఫెసర్లలో అదే సామాజికవర్గం వారికి పదవి అప్పగించినా అభ్యంతరం లేదని ఓ సీనియర్ ప్రొఫెసర్ అభిప్రాయపడ్డారు. ఒకవేళ పాలకమండలి సమావేశం ఆలస్యమైతే... కొత్త వీసీ వచ్చాక అయినా ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రార్‌ను నియమించి తమపై పెత్తనం చెలాయిస్తే సహించబోమని స్పష్టం చేశారు.

సిబ్బంది పదోన్నతుల్లో వివక్ష..

టైం స్కేలు ఉద్యోగులకు క్యాడర్‌వైజ్ ప్రమోషన్లు ఇస్తున్నారు. జీతాలు పెంచకుండా కేవలం హోదాను అప్పగిస్తున్నారు. కానీ రెగ్యులర్ బోధనేతర ఉద్యోగులకు పదోన్నతులు కల్పించడంలో సవాలక్ష నిబంధనలు అడ్డు వస్తున్నాయి. బోధనేతర ఉద్యోగులకు 16 మందికి సోమవారం పదోన్నతులు కల్పించి.. తక్కిన వారికి కల్పించలేదు. దీంతో రెగ్యులర్ బోధనేతర ఉద్యోగులపై ఎందుకు వివక్ష చూపిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గడువు విధించి అప్పటిలోపు డిపార్ట్‌మెంటల్ ఎగ్జామ్ ఉత్తీర్ణత అయ్యేలా కోరవచ్చు. కానీ, అస్మదీయులు, తమకు అనుకూలమైన వారు ఉంటే నిబంధనలన్నీ పక్కనబెట్టి అందలం ఎక్కిస్తున్నారని, మిగిలిన వారిని ఇబ్బంది పెడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

'అధికార' పెత్తనం...

విశ్వవిద్యాలయంలో నిబంధనలు తోసిరాజని ఇష్టారాజ్యంగా నిర్ణయాలు తీసుకుంటున్నారు. వర్సిటీ ముఖద్వారం వద్ద ఉన్న షాపింగ్ కాంప్లెక్స్‌లో ఒక గదిని ఎటువంటి టెండర్లు లేకుండా అక్రమంగా కేటాయించారు. ప్రతి షాపింగ్ గదిని అప్పగించేటప్పుడు తప్పనిసరిగా టెండర్లు పిలవాలి. అయితే, ఇందుకు విరుద్ధంగా టీఎన్ఎస్ఎఫ్ నాయకుడికి అప్పగించడం విమర్శలకు దారితీసింది. అధికార పార్టీ నేతలు సిఫార్సు చేస్తే చాలు నిబంధనలు పక్కనబెట్టేస్తున్నారు. ఇక.. వర్సిటీ ప్రాంగణంలోని జన్మభూమి క్యాంటీన్‌ను గతంలో టెండర్ ద్వారా దక్కించుకున్న వ్యక్తిని దౌర్జన్యంగా బయటకు పంపించారు. గత ఐదు నెలల నుంచి టీడీపీకి చెందిన ఓ నాయకుడు ఈ క్యాంటీన్ నిర్వహిస్తున్నారు. నాలుగు నెలల నుంచి క్యాంటీన్ అద్దె కట్టనప్పటికీ అడిగే వారే లేరు. నెలకు రూ.20 వేల అద్దె, కరెంట్ బిల్లు బాకీ ఉన్నప్పటికీ చర్యలు తీసుకోవడం లేదు.

అధికార పార్టీ అడ్డాగా వర్సిటీ



అధికార పార్టీ నాయకుల అడ్డాగా ఎస్కేయూ మారింది. నిబంధనలను తుంగలో తొక్కుతూ అధికార పార్టీ నాయకుల సిఫార్సుల మేరకు వర్సిటీలోని జన్మభూమి క్యాంటీన్, మెయిన్‌గేట్‌లో ఉన్న షాపును కట్టబెట్టారు. పరీక్షల విభాగంలో అక్రమాలకు పాల్పడుతున్న వారిపై చర్యలు లేవు. సీనియర్ ప్రొఫెసర్లకు సీఏఎస్ పదోన్నతులు, బోధనేతర ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలి.

– దివాకర్ నాయక్, ఏబీవీపీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడు

సమస్యలపై స్పందించడం లేదు



నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రార్‌ను నియామకం చేశారు. బోధనేతర ఉద్యోగులకు సకాలంలో పదోన్నతులు కల్పించడం లేదు. సర్టిఫికెట్లను సకాలంలో పంపడంలో పరీక్షల విభాగంలో కొందరు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. పీహెచ్‌డీ వైవాలు పెండింగ్‌లో పెడుతున్నారు.

– పి. హేమంత్ కుమార్, వైఎస్సార్ విద్యార్థి విభాగం నాయకుడు, ఎస్కేయూ

సర్పంచుల హక్కులు కాలరాస్తారా?

- అభివృద్ధిలో భాగస్వాములు కాకుండా చేయడం అన్యాయం
- మంత్రి కేశవ్‌ను కలిస్తేనే నిధులంటూ బ్లాక్‌మెయిల్‌కు పాల్పడటం దుర్మార్గం
- సర్పంచుల తరఫున న్యాయ పోరాటానికి వైఎస్సార్‌సీపీ సిద్ధం
- మాజీ ఎమ్మెల్యే విశ్వ, పంచాయతీ రాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు రవీంద్రారెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి, చిత్రంలో వెన్నపూస రవీంద్రారెడ్డి

ఉరవకొండ: వైఎస్సార్‌సీపీ సర్పంచుల హక్కులు కాలరాస్తారా? అంటూ మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ ఉరవకొండ నియోజకవర్గ సమన్వయకర్త విశ్వేశ్వరరెడ్డి, పార్టీ పంచాయతీ రాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వెన్నపూస రవీంద్రారెడ్డి ధ్వజమెత్తారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ మద్దతు సర్పంచులు, వార్డు సభ్యులతో మాజీ ఎమ్మెల్యే విశ్వ అధ్యక్షతన సమావేశం జరిగింది. గ్రామాల్లో సర్పంచులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. హక్కులను సాధించుకోవడానికి భవిష్యత్తులో చేయాల్సిన పోరాటాలపై చర్చించారు. అనంతరం విలేకర్ల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే విశ్వ మాట్లాడుతూ పంచాయతీరాజ్ వ్యవస్థను నిర్వీర్యం చేసేలా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 90 శాతం సర్పంచులు వైఎస్సార్‌సీపీ మద్దతుతో గెలుపొందిన వారేనని, దీంతో కక్షగట్టి వారి హక్కులను కాలరాస్తున్నారని దుయ్యబట్టారు. గ్రామాల్లో టీడీపీ నేతలు సర్పంచులకు కనీస గౌరవం కూడా ఇవ్వడం లేదన్నారు.ఉరవకొండ నియోజకవర్గంలో ఎస్సీ, ఎస్టీ సర్పంచులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు.మంత్రి కేశవ్‌ను కలిస్తేనే పెండింగ్ బిల్లులతో పాటు గ్రామాల అభివృద్ధికి నిధులు మంజూరవుతాయని బ్లాక్‌మెయిల్‌కు పాల్పడటం దుర్మార్గమన్నారు. సర్పంచుల హక్కులకు భంగం కల్గిస్తున్న టీడీపీ నేతలపై న్యాయ పోరాటానికి సిద్ధమవుతున్నట్లు వెల్లడించారు. త్వరలో హైకోర్టును ఆశ్రయించనున్నట్లు తెలిపారు. దేశానికి పట్టుకొమ్మలైన గ్రామాలు అభివృద్ధి పథంలో పయనిస్తేనే సంపద సృష్టించడం సాధ్యమవుతుందనే విషయాన్ని సీఎం చంద్రబాబు గ్రహించాలని హితవు పలికారు.

పైసా కూడా కేటాయించలేదు..

స్టేట్ ఫైనాన్స్ కమిషన్, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకూ పంచాయతీలకు ఒక్క పైసా కూడా కేటాయించలేదని వైఎస్సార్ సీపీ రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడు రవీంద్రారెడ్డి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన 15వ ఫైనాన్స్ కమిషన్ ద్వారా రూ.988 కోట్లు విడుదలైతే రాష్ట్ర ప్రభుత్వం గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. ఈ నిధులను కూడా గత టీడీపీ ప్రభుత్వంలో పనులు చేసిన కాంట్రాక్టర్లకు మళ్లించి దుర్వినియోగం చేశారన్నారు. 'పంచాయతీల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం, ప్రతి పంచాయతీకి రూ.10 వేలు చెల్లిస్తాం' అంటూ ఆగస్టు 15న రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆర్భాటంగా ప్రకటించినా నేటికీ పైసా విడుదల కాలేదన్నారు. చేతకాని సీఎం, డిప్యూటీ సీఎంల అసమర్థ పాలనతో పంచాయతీలు నిర్వీర్యమయ్యాయన్నారు. కార్యక్రమంలో పార్టీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు బెస్త రమణ, జిల్లా పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షులు బసవరాజు, మేజర్ పంచాయతీ సర్పంచ్ మీనుగ లలితమ్మ, పార్టీ అధికార ప్రతినిధి సీపీ వీరన్న, కూడేరు ఎంపీపీ నారాయణరెడ్డి, విడపనకల్లు భీమిరెడ్డి, బెళుగుప్ప త్రిలోక్‌రెడ్డి, ఉరవకొండ జెడ్పీటీసీ ఏసీ పార్వతమ్మ, నాయకులు భీమిరెడ్డి, మాజీ ఎంపీపీ చందాచంద్రమ్మ, భూమా కమలమ్మ తదితరులు పాల్గొన్నారు.

తిరగలేకున్నాం.. స్పందించరూ



- ఈ రైతు పేరు చిత్ర ఓబన్న. ఆత్మకూరు మండలం రంగాపేట గ్రామం. సర్వే నం. 527లో ఉన్న ఇతని భూమికి రస్తా సమస్య ఏర్పడింది. పక్క పొలం వ్యక్తి దారివ్వకుండా దౌర్జన్యం చేస్తున్నాడు. దీనిపై ఇప్పటికే అనేకసార్లు తహసీల్దారు, ఆర్‌డీఓ, కలెక్టరేట్‌లో అర్జీ ఇచ్చినా పరిష్కారం కాలేదు. సోమవారం మళ్లీ కలెక్టరేట్‌కు వచ్చి కలెక్టర్ వినోద్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఇప్పటికైనా పరిష్కరించాలని కోరారు.



- ఈమె పేరు బి.అరుణ. కూడేరు మండలం చోళసముద్రం గ్రామం. తన వికలాంగ పింఛనును ఏడు నెలల క్రితం నిలిపివేశారని కలెక్టర్ ఎదుట అరుణ వాపోయారు. దివ్యాంగురాలైన తాను ఏపనీ చేసుకోలేనని, వికలాంగ పింఛను మంజూరు చేసి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

- ప్రజా సమస్యల పరిష్కార వేదికలో బాధితుల ఆక్రందన



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: 'చాలా రోజులుగా తిరుగుతున్నాం. ఇక మా వల్ల కాదు. ఇప్పటికైనా మా సమస్యలు పరిష్కరించండి' అంటూ కలెక్టర్ వి.వినోద్ కుమార్ ఎదుట పలువురు బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కారవేదిక కార్యక్రమానికి వివిధ సమస్యలపై 380 వినతులు అందాయి. కలెక్టర్‌తో పాటు జేసీ శివ్ నారాయణ శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ బి.వినూత్న, డీఆర్‌ఓ ఎ.మలోల తదితరులు అర్జీలు స్వీకరించారు.

వినతుల్లో కొన్ని...

- అనంతపురం నగర పాలక సంస్థలో కాంట్రాక్టు కార్మికురాలిగా పనిచేసిన తన భార్య 2019లో ఉద్యోగ విరమణ చేసిందని, ఆమెకు రావాల్సిన ఈపీఎఫ్ మొత్తం ఇప్పటికీ ఇవ్వలేదని నగరంలోని అంబేడ్కర్ నగర్‌కు చెందిన కొండప్ప ఫిర్యాదు చేశారు. చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.
- 25 నెలల క్రితం తన తల్లి పేరున ఇంటి స్థలం మంజూరు చేసి డి.పట్టా ఇవ్వలేదని అనంతపురం రూరల్ మండలం బసవతారక నగర్‌కు చెందిన కె.సువర్ణ వాపోయారు. పట్టా ఇప్పించాలని కోరారు.
- తన పొలానికి రస్తా సమస్యను పరిష్కరించాలని కూడేరు మండలం కరుట్లపల్లికి చెందిన హనుమంతరెడ్డి కోరారు. అర్జీలిస్తూనే ఉన్నా ప్రయోజనం లేకుండా పోయిందని ఆవేదన చెందారు.

సూక్ష్మ సాగుకేదీ మోక్షం!

- రైతులకు అందని రాయితీ డ్రిప్, స్ప్రింక్లర్ పరికరాలు
- జిల్లాకు 42,100 హెక్టార్ల లక్ష్యం కేటాయింపు
- ఇప్పటికి 2,200 హెక్టార్లకు మాత్రమే మెటీరియల్



డ్రిప్ ద్వారా టమాటా సాగు

అనంతపురం అగ్రికల్చర్: కూటమి సర్కారు అమలు చేస్తున్న సూక్ష్మసాగు పథకం నత్తతో పోటీ పడుతోంది. జిల్లాకు చంద్రబాబు ప్రభుత్వం 42,100 హెక్టార్ల భారీ లక్ష్యం నిర్దేశించింది. అయితే, క్షేత్రస్థాయిలో మాత్రం ఏపీఎంఐపీ అధికారులు మందకొడిగా నడిపిస్తున్నారు. దీంతో రైతులకు రాయితీతో డ్రిప్, స్ప్రింక్లర్ (బిందు, తుంపర) పరికరాలు అందడం లేదు. చెప్పుకునేందుకు మాత్రమే భారీ లక్ష్యం విధించిన కూటమి సర్కారు సకాలంలో డ్రిప్, స్ప్రింక్లర్లు అందించడంపై మాత్రం దృష్టి సారించడం లేదు.

57 వేల హెక్టార్లకు రిజిస్ట్రేషన్లు..

జిల్లా వ్యాప్తంగా ఆర్ఎస్‌కేల్లో 41 వేల మంది రైతులు 57 వేల హెక్టార్లకు డ్రిప్, స్ప్రింక్లర్లు కావాలని రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. అందులో 90 శాతం మంది డ్రిప్ కోసం నమోదు చేసుకున్నారు. ప్రభుత్వం కూడా 42,100 హెక్టార్ల టార్గెట్ ఇవ్వడంతో అందరికీ పరికరాలు అందిస్తారని ఆశపడ్డారు. అయితే, ప్రభుత్వం కొలువుతీరి ఆరు నెలలు కావస్తున్నా ఇప్పటివరకూ 1,850 మంది రైతులకు 4,700 హెక్టార్లకు మాత్రమే మంజూరు ఉత్తర్వులు ఇచ్చారు. అందులోనూ రైతులకు పరికరాలు అందించింది 2,200 హెక్టార్లకు మాత్రమే. డ్రిప్ కోసం తమ వాటా చెల్లించడానికి రైతులు సిద్ధంగా ఉన్నా.. ప్రాథమిక పరిశీలన, బీవోక్యూ, బీఎంసీ అంటూ జాప్యం చేస్తున్నట్లు తెలిసింది. ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు బడ్జెట్ విడుదల కాకపోవడంతో డ్రిప్ కంపెనీలు కూడా పరికరాల సరఫరా తగ్గించాయి. దీంతో రైతులకు ఇబ్బందిగా మారింది. 42,100 హెక్టార్ల లక్ష్యానికి గానూ ప్రస్తుతానికి 2,200 హెక్టార్లకు మాత్రమే పరికరాలు అందించిన నేపథ్యంలో మిగతా నాలుగు నెలల కాలంలో లక్ష్యం సాధించడం అసాధ్యమని చెబుతున్నారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులందరికీ సూక్ష్మసాగు పరికరాలు అందే పరిస్థితి లేదని ఏపీఎంఐపీ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

భారీ డిమాండ్..

ఉద్యాన పంటలు, వ్యవసాయ పంటల పరంగా అత్యధిక విస్తీర్ణంతో పాటు వర్షాభావ పరిస్థితులు నెలకొన్న జిల్లాలో నీటి వనరులను తగిన రీతిలో వాడుకోవాలంటే సూక్ష్మసాగు పద్ధతులు అవలంబించడం తప్పనిసరిగా మారింది. దీంతో జిల్లా వ్యాప్తంగా రైతుల నుంచి డ్రిప్, స్ప్రింక్లర్లకు భారీ డిమాండ్ నెలకొంది. ప్రభుత్వం ఇచ్చే పరికరాలపై నమ్మకం లేక చాలా మంది రైతులు బహిరంగ మార్కెట్‌లో అధిక ధరలతో పాటు నాసిరకం పరికరాలు కొనుగోలు చేస్తున్న దుస్థితి ఏర్పడింది. లేదంటే సకాలంలో పంటలు సాగు చేయలేని పరిస్థితి. సూక్ష్మసాగుకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తామని కూటమి సర్కారు ప్రకటించడంతో ఆర్ఎస్‌కేల్లో రైతులు పెద్దసంఖ్యలో రిజిస్ట్రేషన్లు చేసుకుని పరికరాల కోసం నెలల తరబడి ఎదురుచూస్తున్నారు.



ఓపీ నం. 4లో కనిపించని వైద్యులు, బయట వేచి ఉన్న రోగులు



ఓపీ నం.8లో ఖాళీగా కుర్చీలు, బయట రోగుల పడిగాపులు

ఓపిక లేదా సారూ?

అనంతపురం మెడికల్: అనంతపురం సర్వజనాస్పత్రిలోని వివిధ విభాగాల్లో వైద్యులు బాధ్యతారాహిత్యంతో వ్యవహరిస్తున్నారు. ముఖ్యంగా మెడిసిన్ ఓపీ(అవుట్ పేషంట్) నంబర్ 2, 3, సర్జరీ ఓపీ నంబర్ 8, చిన్నపిల్లల ఓపీ నంబర్ 4లో వైద్యుల నిర్లక్ష్యం తారస్థాయికి చేరిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ విభాగాల్లో కనీసం పట్టుమని రెండు, మూడు గంటలు కూడా వైద్యులు ఉండటం లేదు. సోమవారం ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి వందల సంఖ్యలో రోగులు ఆస్పత్రికి వచ్చారు. గంటకుపైగా క్యూలో నిల్చుని చీటీ తీసుకున్నాక ఆయా ఓపీ విభాగాలకు వెళ్లిన వారికి అక్కడ వైద్యులు కానరాకపోవడంతో నిరాశ చెందారు. వాస్తవంగా ప్రతి సోమవారం ఆస్పత్రిలో 2 వేల వరకు ఓపీ ఉంటుంది. వైద్యులు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 వరకు అందుబాటులో ఉండాలి. కానీ చాలా విభాగాల్లో ఆ పరిస్థితి కనిపించడం లేదు. పీజీలపై భారం మోపి నిర్లక్ష్యం చేస్తున్నారు. ఓపీలను పర్యవేక్షించాల్సిన రెసిడెన్షియల్ మెడికల్ ఆఫీసర్లు (ఆర్ఎంఓ) నిద్రమత్తులో ఉంటున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా ఆస్పత్రి ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోవాల్సి ఉంది.

క్లుప్తంగా

క్రీడా పోటీల్లో 'విభిన్న' ప్రతిభ


పరుగు పందెంలో పాల్గొన్న దివ్యాంగులు

అనంతపురం: అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో సోమవారం దివ్యాంగులకు అనంతపురంలోని పీటీసీ మైదానంలో పలు క్రీడా పోటీలు నిర్వహించారు. 100 మీటర్ల పరుగు, షాట్‌పుట్, డిస్కస్ త్రో, లాంగ్‌జంప్ పోటీల్లో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన 60 మంది దివ్యాంగ క్రీడాకారులు పాల్గొన్నారు. డీఎస్‌డీఓ ఉదయ్ భాస్కర్, పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ నాగరాజు, కార్యదర్శి శ్రీనివాసులు, డీఎస్‌ఏ కోచ్ ఎస్‌ఎం మంజుల, ఎస్.ఇస్మాయిల్ జబీవుల్లా, ఎన్.అనిల్‌కుమార్, ఎం.సంధ్య, జి.సుబ్రహ్మణ్యం, అంజన్‌కుమార్, చలపతి తదితరులు పాల్గొన్నారు.

ప్రహరీ గేటు ఊడి పడి బాలుడి మృతి


మనోజ్ తేజ (ఫైల్)

కూడేరు: ప్రహరీ గేటు ఊడి మీద పడడంతో ఓ బాలుడు మృతి చెందాడు. వివరాలు... కూడేరు మండలం కలగళ్లకు చెందిన షేకన్న, లక్ష్మీదేవి దంపతుల కుమార్తె పార్వతిని గార్లదిన్నె మండలం కొప్పలకొండకు చెందిన గోపాల్‌కిచ్చి వివాహం చేశారు. వీరికి నాలుగేళ్ల వయసున్న కుమారుడు మనోజ్ తేజ, రెండేళ్ల వయసున్న కుమార్తె ఉన్నారు. ఆదివారం పిల్లలను పిలుచుకుని పార్వతి పుట్టింటికి వచ్చింది. సాయంత్రం పిల్లలతో కలసి ప్రహరీ గేటుతో ఆడుకుంటుండగా ఉన్నఫళంగా గేటు ఊడి మనోజ్‌పై పడింది. తలకు బలమైన గాయం కావడంతో కుటుంబ సభ్యులు వెంటనే అనంతపురంలోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో సోమవారం ఉదయం బాలుడు మృతి చెందాడు. ఒక్కగానొక్క కుమారుడి మృతితో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.

డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

అనంతపురం రూరల్: డీఎస్సీ ఉచిత శిక్షణలో భాగంగా ఖాళీగా సీట్లను అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ అభ్యర్థులతో భర్తీ చేస్తున్నట్లు బీసీ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ కుష్బూకొఠారి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 60 రోజుల పాటు శిక్షణ ఉంటుంది. 75 శాతం హాజరు ఉంటే , స్టైఫండ్‌తో పాటు స్టడీ మెటీరియల్‌ను ఉచితంగా అందిస్తారు. పూర్తి వివరాలకు 08554-275575, 7799043773లో సంప్రదించవచ్చు.

కష్టాల ఫెంగల్


పామురాయి సమీపంలో వరి ధాన్యం కుప్పలపై కప్పిన కవర్లు

దెబ్బ మీద దెబ్బ... కష్టం తీరక ముందే మరో కష్టం. కాయాకష్టంతో పది మందికి ఆహారాన్ని అందించే రైతన్నల దుస్థితి ఇది. విత్తు మొదలు దిగుబడి ఇంటికి చేరే వరకూ కంటికి రెప్పలా పంటను కాపాడుకుంటే... చివరకు వానదేవుడు తుపాను (ఫెంగల్) రూపంలో కబళించే ప్రయత్నం చేస్తున్నాడు. ఆకాశం మేఘావృతమై తేలికపాటి జల్లులు కురుస్తుండడంతో కళ్లాలు, రోడ్ల పక్కన ఆరబోసిన ధాన్యం నాలుగు రోజులుగా సూర్యుడి ముఖం చూడలేకపోతోంది. ఏమాత్రం జల్లులు కురిసినా పట్టాలు కప్పడంలోనే రైతుల దిన చర్య ముగిసిపోతోంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం


అనంతపురంలోని ఇస్కాన్ టెంపుల్ వద్ద ఆరబోసిన ధాన్యం వర్షానికి తడవకుండా పట్టా కప్పుతున్న రైతులు

బాబు ష్యూరిటీ.. బాదుడు గ్యారెంటీ


గుంతకల్లులో ట్రాన్స్‌కో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

- విద్యుత్ చార్జీల పెంపును వ్యతిరేకిస్తూ వైఎస్సార్‌సీపీ ధర్నా

గుంతకల్లు టౌన్: బాబు ష్యూరిటీ.. ప్రజల నడ్డి విరచడం గ్యారెంటీ అనే విషయం ఈ ఆరు నెలల చంద్రబాబు పాలనలో స్పష్టంగా తెలుస్తోందని మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవానీ, వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి మండిపడ్డారు. ఆరు నెలల పాలనలో రెండు సార్లు విద్యుత్ చార్జీలను పెంచడాన్ని వ్యతిరేకిస్తూ సోమవారం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో గుంతకల్లు ట్రాన్స్‌కో ఏడీఈ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తున్న కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తాను అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచనని ఎన్నికల సమయంలో హామీనిచ్చిన చంద్రబాబు... అధికారం చేపట్టిన ఆరునెలల్లోనే ట్రూఅప్ ఛార్జీల పేరుతో రెండు సార్లు విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై రూ.15,485 కోట్ల భారాన్ని మోపారని మండిపడ్డారు. నమ్మిన ప్రజలను మోసం చేయడంలో చంద్రబాబును మించిన వారు లేరన్నారు. పెంచిన విద్యుత్ చార్జీలను ఉపసంహరించుకోకపోతే ఉద్యమాలు తీవ్రతరం చేస్తామని హెచ్చరిస్తూ ట్రాన్స్‌కో ఏఈ రవిచంద్రకు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ మైమూన్, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్లు గాది లింగేశ్వరబాబు, భీమలింగప్ప, పార్టీ పట్టణ అధ్యక్షుడు సుంకప్ప, ఎస్సీ సెల్ జోనల్ చైర్మన్ జింకల రామాంజినేయులు, కౌన్సిలర్లు చాంద్‌బాషా, సుమో బాషా, కో ఆప్షన్ సభ్యులు ఫ్లయింగ్‌మాబు, నూర్‌నిజామి, వార్డు ఇన్‌చార్జ్‌లు, పట్టణ, మండల పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీదోళ్లపై భారం మోపితే ఎట్లయ్యా?


ట్రాన్స్‌కో ఏఈని ప్రశ్నిస్తున్న అంజినమ్మ

గుంతకల్లు టౌన్: గతంలో రూ.వందల్లో వచ్చే కరెంటు బిల్లు ఈ ఐదు నెలలుగా రూ.వేలల్లో వస్తోందని, బీదోళ్లపై ఇలా భారం మోపితే ఎలాగంటూ ట్రాన్స్‌కో ఏఈని ఓ సామాన్య మహిళ నిలదీసింది. పెంచిన విద్యుత్ చార్జీలను నిరసిస్తూ గుంతకల్లు ట్రాన్స్‌కో ఏడీఈ కార్యాలయం ఎదుట వైఎస్సార్‌సీపీ నాయకులు ధర్నా చేస్తున్న సమయంలో అక్కడకు చేరుకున్న 11వ వార్డులో నివాసముంటున్న అంజినమ్మ నేరుగా ట్రాన్స్‌కో ఏఈని కలసి తన గోడు వెళ్లబోసుకుంది. ఏ రోజుకా రోజు పనికి పోతే తప్ప పూట గడవని స్థితిలో ఉన్న తన ఇంట్లో ఓ ఫ్యాన్, రెండు బల్బులు, ఓ ఫ్రిడ్జ్ ఉందని, గతంలో విద్యుత్ వినియోగానికి సంబంధించి నెలకు రూ.300 నుంచి రూ.500లోపు బిల్లు వచ్చేదని వివరించింది. ఈ ఐదు నెలలుగా ప్రతి నెలా రూ.1,375 నుంచి రూ.1500 వరకూ బిల్లు వస్తోందని వాపోయింది. అయితే తనకు ఇక్కడ ఆందోళన జరుగుతున్న విషయం తెలియదని, తనను ఏ పార్టీ వారూ పిలవలేదని, కానీ, జగనన్న హయాంలో ఇంత పెద్దమొత్తంలో కరెంటు బిల్లులు ఏనాడూ రాలేదని తెలిపింది. ఐదారు నెలలుగా కరెంట్ బిల్లు ఎందుకు ఎక్కువ వస్తుందో అడిగేందుకు వచ్చానని, బీదోళ్లపై ఇంతటి భారం వేస్తే బతికేది ఎట్లా? అంటూ ప్రశ్నించింది. కాగా, అంజినమ్మ అడిగిన ప్రశ్నలకు ఏఈ రవిచంద్ర సమాధానం ఇవ్వలేక ఇబ్బంది పడ్డారు.

ఒక్క నెల బిల్లు రూ.860!

కుందుర్పి: మండలంలోని తూముకుంట గ్రామానికి చెందిన గంగాధర ఇంటికి విద్యుత్ బిల్లు ఏకంగా రూ.860 వచ్చింది. ఇది చూసిన గంగాధర్ అవాకయ్యారు. తన ఇంట్లో 3 బల్బులు మాత్రమే ఉన్నాయని, ప్రతి నెలా రూ.200 నుంచి రూ.250లోపే బిల్లులు వచ్చేవని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. కానీ, నవంబర్‌కు చెందిన బిల్లు మాత్రం రూ.860 ఎలా వచ్చిందో చెప్పాలంటూ ట్రాన్స్‌కో సిబ్బందిని ప్రశ్నించారు. అయితే తమకేమీ తెలియదని, మీటర్ రీడింగ్‌లో వచ్చిన మేరకు బిల్లులు అందజేస్తున్నామని, డబ్బు కట్టక పోతే కరెంట్ తొలగిస్తామని హెచ్చరించారు.

అప్పుల బాధతో యువరైతు ఆత్మహత్య


నాగరాజు (ఫైల్)

గార్లదిన్నె: అప్పులు తీర్చే మార్గం కానరాక ఓ యువరైతు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... గార్లదిన్నె మండలం యర్రగుంట్ల గ్రామానికి చెందిన తిరుపాల్, సుంకమ్మ దంపతుల కుమారుడు నాగరాజు (28) తమకున్న 3.85 ఎకరాల భూమిలో వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. పంట పెట్టుబడులు కోసం ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల వద్ద అప్పు చేశాడు. అయితే పంటలు సక్రమంగా పండక పోవడంతో అప్పులు ఎలా తీర్చాలంటూ మదన పడుతూ తమకున్న భూమిలో 3 ఎకరాలను అమ్మి కొంత మేర అప్పులు చెల్లించాడు. అయితే వ్యవసాయం పనులు కోసం కొనుగోలు చేసిన ట్రాక్టర్‌కు సంబంధించి కంతులు రూ.3 లక్షలు కట్టలేకపోవడంతో ఆ వాహనాన్ని ఫైనాన్స్ కంపెనీ వారు లాక్కెళ్లారు. ఇంకా దాదాపు రూ.15 లక్షల మేర ఉన్న అప్పులు ఎలా తీర్చాలో అర్థం కాక తీవ్ర మనోవేదనకు లోనైన నాగరాజు సోమవారం ఉదయం తమ చీనీ తోటలో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. సమాచారం అందుకున్న సీఐ కౌలుట్లయ్య, పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టనట్లు ఎస్‌ఐ గౌస్‌మహమ్మద్ బాషా తెలిపారు.

రిజిస్టర్‌లో ప్రతి ఫైల్ ఎంట్రీ చూపండి

- సిబ్బందికి ఖజానాశాఖ డైరెక్టర్ మోహన్‌రావు ఆదేశం


రిజిస్టర్‌ల ఎంట్రీలను పరిశీలిస్తున్న మోహన్‌రావు

అనంతపురం అర్బన్: కార్యాలయానికి చేరిన ప్రతి ఫైల్‌కు సంబంధించి రిజిస్టర్‌లో ఎంట్రీ తప్పనిసరిగా చూపాలని సంబంధిత అధికారులు, సిబ్బందిని ఖజానా శాఖ డైరెక్టర్ మోహన్‌రావు ఆదేశించారు. జిల్లాకు సోమవారం విచ్చేసిన ఆయన జిల్లా ఖజానా శాఖలోని అన్ని విభాగాలను తనిఖీ చేశారు. అక్కడి అధికారులు, సిబ్బందితో మాట్లాడి వారు నిర్వర్తిస్తున్న విధులపై ఆరా తీశారు. బిల్లులు పాస్ చేసే విషయంలో విమర్శలకు తావివ్వరాదన్నారు. అనంతరం ఎస్టాబ్లిష్‌మెంట్ విభాగాన్ని సందర్శించి అక్కడి రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఆయన వెంట డీడీ సరళ విజయ కుమారి, ఏటీఓ రాణి, తదితరులు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోండి

ప్రభుత్వ పెన్షనీర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని ఖజానా శాఖ డైరెక్టర్ మోహన్‌రావుకు పెన్షనీర్ల సంఘం నాయకులు విన్నవించారు. సోమవారం జిల్లా ఖజానా శాఖ డీడీ చాంబర్‌లో ఆయనను సంఘం జిల్లా అధ్యక్షుడు పెద్దన్నగౌడ్, విశ్రాంత తహసీల్దార్లు గోవిందరాజులు, నాగరాజు, తదితరులు కలసి వినతిపత్రం అందజేసి, మాట్లాడారు. ముఖ్యంగా ఎస్‌టీఓల పరిధిలో సమస్యలు పరిష్కారం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి రెండు లేదా మూడు నెలలకు ఒకసారి జిల్లాస్థాయిలో అందరూ ఎస్‌టీఓలు, ఏటీఓలు, తాలూకాస్థాయిలో ఎస్టీఓ, ఏటీఓలతో పెన్షనీర్ల సంఘం నాయకులు, జిల్లా నాయకులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేసేలా చూడాలన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఖజానా శాఖ డైరెక్టర్ మోహన్‌రావుకు ఎన్‌జీఓ సంఘం నాయకులు విన్నవించారు. సోమవారం ఆ శాఖ డీడీ చాంబర్‌లో ఎన్‌జీఓ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చంద్రశేఖర్‌రెడ్డి, చంద్రమోహన్, తదితరులు కలసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం ఉద్యోగుల సమస్యలు, బకాయిల అంశాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సరెండర్ లీవులు, 3 విడతల డీఏ బకాయి, జీపీఎఫ్ బకాయి, ఉద్యోగ విరమణ చేసిన వారికి సంబంధించిన బకాయిలు అందక చాలామంది తీవ్ర ఇబ్బంది పడుతున్నారన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కోశాధికారి ప్రవీణ్‌కుమార్, సంయుక్త కార్యదర్శి మహేశ్వరరెడ్డి, ధర్మవరం తాలూకా అధ్యక్షుడు శంకర్ పాల్గొన్నారు.


బాకీ తీర్చమంటే బెదిరిస్తున్నారు

- ఎస్పీని కలిసిన 60 మంది బాధితులు


ఎస్పీ జగదీష్‌ను కలసి బయటకు వస్తున్న బాధితులు

అనంతపురం: బాకీ తీర్చమంటే తమని భయభ్రాంతులకు గురిచేస్తూ బెదిరిస్తున్నారని ఎస్పీ పి.జగదీష్ వద్ద పలువురు బాధితులు మొరపెట్టుకున్నారు. ఈ మేరకు సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతి పత్రాన్ని అందజేసి, మాట్లాడారు. అనంతరం వారు డీపీఓ బయట విలేకరులతో మాట్లాడారు. అనంతపురంలోని రెండో రోడ్డు నివాసం ఉంటున్న హోసూరు లక్ష్మీనారాయణ కొడుకు హోసూరు మల్లికార్జున, ఆయన భార్య రాజేశ్వరి, కుమారుడు రాఘవేంద్ర, కోడలు మంజుల నలుగురూ కలసి మొత్తం 60 మందితో రూ.8 కోట్ల అప్పు చేశారు. ఈ మొత్తంలో స్థిరాస్తులు కొనుగోలు చేశారు. సొంతంగా ఇల్లూ నిర్మించుకున్నారు. అప్పు తీర్చాలని అడిగితే ఇదిగో... అదిగో అంటూ మూడేళ్లుగా కాలయాపన చేస్తూ వచ్చారు. తీసుకున్న అసలు, వడ్డీ చెల్లించలేకపోతున్నందుకు వారి పేరుతో ఉన్న రూ.4.5 కోట్ల స్థిరాస్తిని విక్రయించుకోవాలని తెలపడంతో తమకు రావాల్సిన మొత్తానికి దామాషా పద్ధతిలో పంచుకునేందుకు అందరూ అంగీకారం తెలిపారు. ఈ క్రమంలో కొనుగోలుదారులకు స్థిరాస్తిని చూపించేందుకు వెళితే అసభ్య పదజాలంతో దూషిస్తున్నారు.... బెదిరిస్తున్నారు. ఎదురుదాడికి దిగుతున్నారు. అప్పు ఇచ్చిన వాళ్లలో విశ్రాంత ఉద్యోగులు, వితంతువులు, మధ్య తరగతి వారు ఆడపిల్లల పెళ్లి కోసం దాచుకున్న డబ్బు ఉంది. ఈ క్రమంలో తమకు న్యాయం చేయాలని ఎస్పీని కలసి విన్నవించినట్లు బాధితులు తెలిపారు. కాగా, జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వివిధ సమస్యలపై 76 వినతులు అందాయి. ఎస్పీ జగదీష్ స్వయంగా వినతులు స్వీకరించి, బాధితులతో మాట్లాడారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ డీవీ రమణమూర్తి, మహిళా పీఎస్ డీఎస్పీ ఎస్.మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

ఈ దౌర్జన్యం ఇంకెన్నాళ్లు?


దౌర్జన్యంగా బండలను పగులగొడుతున్న టీడీపీ కార్యకర్తలు (ఫైల్)

అనంతపురం: కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత బుక్కరాయసముద్రం మండలంలో టీడీపీ నేతల దౌర్జన్యాలు పెచ్చుమీరాయని, ఈ దౌర్జన్యాలను ఇంకెన్నాళ్లు భరించాలంటూ ఎస్పీ జగదీష్‌ను పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రశ్నించారు. బీకేఎస్ మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు వెంకటనారాయణరెడ్డి ఇంటిపై ఆదివారం టీడీపీ నాయకుడు నాగరాజు, ఆయన అనుచరులు చేసిన దాడిని ఖండిస్తూ ఎస్పీని సోమవారం కలిసి ఫిర్యాదు చేశారు. కోర్టు వివాదంలో ఉన్న స్థలంలో బండలను దౌర్జన్యంగా ధ్వంసం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని విన్నవించారు. పెద్ద సంఖ్యలో ఉన్న పోలీసులు సైతం చోద్యం చూశారు తప్ప దౌర్జన్యాన్ని అడ్డుకోలేకపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే టీడీపీ నాయకులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఎస్పీని కలిసిన వారిలో బాధిత వెంకటనారాయణరెడ్డితో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు తిరుపాల్‌రెడ్డి, బాలకృష్ణారెడ్డి, శివకోటిరెడ్డి, సురేష్ ఉన్నారు.

మహిళలపై అకృత్యాలు అరికడదాం

అనంతపురం అర్బన్: మహిళలపై అకృత్యాలు జరగకుండా అరికడదామని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ పిలుపునిచ్చారు. మహిళాశిశు అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని పోస్టర్లను విడుదల చేసి, మాట్లాడారు. ఈనెల 10వ తేదీ వరకు పక్షోత్సవాలు నిర్వహించాలన్నారు. ఎక్కడైనా హింస జరిగితే ఉమెన్ హెల్ప్‌లైన్ 181, పోలీసు 100/112, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 నంబర్లలో సంప్రదించాలన్నారు. అనంతరం అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో ఈనెల 4వ, 5వ తేదీల్లో నిర్వహించనున్న రీజనల్ పాలిటెక్ ఫెస్ట్- 2024 పోస్టర్లను విడుదల చేశారు. ఎన్‌టీఆర్ భరోసా పథకం కింద పింఛన్ల పంపిణీలో ఉత్తమ సేవలందించిన ఉద్యోగులను సన్మానించారు.

- ఇటీవల మరణించిన తహసీల్దారు భరత్‌కు కలెక్టర్, అధికారులు సంతాపం తెలిపారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణశర్మ, అసిస్టెంట్ కలెక్టర్ బి.వినూత్న, డీఆర్‌ఓ ఎ.మలోల, టూరిజం అధికారి జయకుమార్ బాబు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

విడపనకల్లు ఏపీఓని సస్పెండ్ చేయండి

మొదటి నుంచి ఉపాధి పనుల్లో పురోగతి చూపని విడపనకల్లు ఏపీఓని సస్పెండ్ చేయాలని కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. జిల్లావ్యాప్తంగా క్యాటిల్ షెడ్ల నిర్మాణం ఈ నెలాఖరుకు పూర్తవ్వాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఉపాధి పథకం అమలుపై సోమవారం అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ సమీక్షించారు. ప్రతి వారం సీసీ రోడ్లకు సంబంధించి 250 పనులు, సీసీ కాలువలకు సంబంధించి 75 పనులు పూర్తి కావాలన్నారు. లేబర్ బడ్జెట్‌కు సంబంధించి లక్ష్యాలు ఈనెల 26వ తేదీలోగా పూర్తి కావాలన్నారు. విడపనకల్లు, వజ్రకరూర్, ఉరవకొండ, కూడేరు మండలాల్లో ఉపాధి పనుల కల్పనలో వెనబడ్డారని, పురోగతి చూపని అధికారులు, సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

సైనిక సంక్షేమానికి విరాళాలు ఇవ్వండి

మాజీ సైనికుల సంక్షేమానికి, సాయుధ దళాల పతాక నిధికి విరాళాలు ఇవ్వాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ పిలుపునిచ్చారు. ఈ నెల 7న సాయుధ దళాల పతాక దినోత్సవాన్ని విజయంతం చేయాలంటూ సోమవారం కలెక్టరేట్‌లో పోస్టర్లను, కార్ ఫ్లాగ్‌లు, స్టిక్కర్లు, కరపత్రాలను ఆవిష్కరించి, మాట్లాడారు. మాజీ సైనికుల పునరావస కార్యక్రమంలో అమరులైన వీర జవాన్ల కుటుంబ సభ్యులను, వితంతువులను ఆదుకునే క్రమంలో విరాళాలు అందించాలన్నారు. విరాళాలను ఎస్‌సీసీ, ఎన్ఎస్ఎస్ విద్యార్థుల హుండీ ద్వారా లేదా సైనిక సంక్షేమ శాఖ ఎస్‌బీఐ ఖాతా 62076956433, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ SBIN 0021438 కు నగదు బదిలీ ద్వారా అందించవచ్చన్నారు.

బీఎస్ఎన్ఎల్ విశ్రాంత ఉద్యోగి ఇంట్లో చోరీ

కళ్యాణదుర్గం రూరల్: స్థానిక బసవేశ్వర నగర్‌లో నివాసముంటున్న బీఎస్ఎన్ఎల్ విశ్రాంత ఉద్యోగి ఇంట్లో చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు... విశ్రాంత ఉద్యోగి ప్రసాద్ ఆదివారం మధ్యాహ్నం తన ఇంటికి తాళం వేసి వ్యక్తిగత పనిపై బయటకు వెళ్లాడు. ఇదే అదునుగా భావించిన దుండగులు ఇంటి వెనుక వైపు ఉన్న తలుపు నుంచి లోపలకు చొరబడి బీరువాలోని 4 తులాల బంగారం, 2 కిలోల వెండిని అపహరించారు. ఆదివారం సాయంత్రం ఇంటికి చేరుకున్న ప్రసాద్... చోరీ విషయాన్ని గుర్తించి సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఘటనపై సోమవారం ఉదయం కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

గ్యాస్ లీకేజీతో మంటలు... తల్లీకుమార్తెకు గాయాలు

గుంతకల్లు రూరల్: మండలంలోని నక్కనదొడ్డి తండాలో సోమవారం ఉదయం వంట గ్యాస్ లీకేజీ కారణంగా మంటలు చెలరేగి గృహిణి వాణిశ్రీ, ఆమె కుమార్తె నవ్య తీవ్రంగా గాయపడ్డారు. నక్కనదొడ్డి తండా నివాసి రాముడు నాయక్ ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. భార్య వాణిశ్రీ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సోమవారం ఉదయాన్నే ఆటో తీసుకుని భర్త వెళ్లిపోయిన తర్వాత వంట చేసేందుకు సిద్ధమైన వాణిశ్రీ పైప్ లీకేజీ కారణంగా బయటకు వస్తున్న గ్యాస్‌ను గమనించకుండా స్టవ్‌ను వెలిగించేందుకు అగ్గిపుల్ల గీసింది. దీంతో వాణిశ్రీతోపాటు, పక్కనే ఉన్న కుమార్తె నవ్యపైకి ఒక్కసారిగా మంటలు ఎగిసి పడ్డాయి. చీర అంటుకోవడంతో కుమార్తెను ఎత్తుకుని బయటకు పరుగులు తీసింది. ఇరుగు పొరుగు వారు వెంటనే మంటలను ఆర్పి వేశారు. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బందిఅక్కడకు చేరుకున్న మంటలను అదుపు చేశారు. క్షతగాత్రులను గుంతకల్లు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ రమాదేవి ఆస్పత్రికి చేరుకొని బాధితులను పరామర్శించారు.

పాముకాటుతో వివాహిత మృతి


మృతురాలు బేబి

బ్రహ్మసముద్రం: మండల కేంద్రంలోని తిప్పయ్యదొడ్డికి చెందిన వివాహిత గొల్ల బేబి (26) పాముకాటుతో మృతి చెందింది. పోలీసులు తెలిపిన మేరకు ... ఆదివారం సాయంత్రం తన ఇంటి ఎదుట ఉన్న మొక్కజొన్న పొట్టును పొయ్యిలో పెట్టేందుకు తీస్తుండగా పాము కాటేసింది. విషయాన్ని కుటుంబసభ్యులకు తెలపడంతో వారు వెంటనే కళ్యాణదుర్గంలోని సీహెచ్‌సీకి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి వైద్యులు రెఫర్ చేశారు. చికిత్సకు స్పందించక సోమవారం ఉదయం ఆమె మృతిచెందింది. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ నారేంద్రకుమార్ తెలిపారు.

మార్కెట్ కమిటీల్లో మిశ్రమ స్పందన

- లక్ష్యం దిశగా నాలుగు, వెనుకంజలో ఐదు కమిటీలు

అనంతపురం అగ్రికల్చర్: మార్కెటింగ్‌శాఖ నిర్దేశించిన ఫీజు వసూళ్లలో నాలుగు మార్కెట్ కమిటీల్లో పరిస్థితి ఆశాజనకంగా ఉండగా మిగిలిన ఐదు మార్కెట్లు వెనుకంజలో ఉన్నాయి. ప్రస్తుత 2024-25 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో ఉన్న 9 మార్కెట్ కమిటీలు, 15 చెక్‌పోస్టుల ద్వారా వివిధ రూపాల్లో రూ.12.06 కోట్ల వసూళ్ల లక్ష్యంగా నిర్దేశించుకోగా... నవంబర్‌తో 8 నెలలు ముగిసిన కాలానికి గాను 55.5 శాతంతో రూ.6.70 కోట్లు సాధించాయి. కరువు పరిస్థితులు నెలకొన్నా... గతేడాది ఇదే సమయానికి రూ.29 లక్షలు అధికంగా రూ.6.99 కోట్లు సాధించడం విశేషం. ఊహించినట్లుగానే అనంతపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ రూ.4.60 కోట్లకు గానూ రూ.3.08 కోట్లు వసూళ్లతో 67 శాతం సాధించి మొదటి స్థానంలో పయనిస్తోంది. రూ.1.05 కోట్లకు గానూ రూ.61.25 లక్షలతో 60 శాతం వృద్ధితో శింగనమల రెండో స్థానంలో నిలిచింది. తాడిపత్రి కమిటీ రూ.2.02 కోట్లకు గానూ రూ.1.14 కోట్లు సాధించి 56 శాతంతో మూడో స్థానం, రాయదుర్గం కమిటీ రూ.1.44 కోట్లకు గానూ రూ.74.91 లక్షలు సాధించి 52 శాతంతో లక్ష్యం దిశగా వెళుతున్నాయి. ఇక చిట్టచివరి స్థానంలో కొనసాగుతున్న రాప్తాడు కమిటీ కేవలం 26 శాతం వసూళ్లతో తన స్థానాన్ని పదిలం చేసుకుంది. 35 శాతం వసూళ్లతో గుత్తి, 39 శాతం వసూళ్లతో గుంతకల్లు, కళ్యాణదుర్గం, 41 శాతంతో ఉరవకొండ వెనుకంజలో ఉన్నాయి. ఇక మిగిలిన నాలుగు నెలల కాలంలో ఐదారు కమిటీలు లక్ష్యం సాధించే పరిస్థితి ఉండగా మిగతావి చతికిలపడే పరిస్థితి ఉన్నట్లు సమాచారం.

ముగిసిన 'రైల్వే' ఎన్నికల ప్రచారం

గుంతకల్లు/గుత్తి: ఈ నెల 4, 5, 6వ తేదీల్లో జరగనున్న రైల్వే గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలకు సంబంధించి ప్రచారానికి సోమవారంతో తెరపడింది. దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్, ఎంప్లాయీస్ సంఘ్ మధ్య ప్రధాన పోటీ నెలకొనగా ఆయా సంఘాల నాయకులు పోటాపోటీగా ప్రచారం చేశారు. కాగా, 4వ తేదీ నుంచి ప్రారంభమయ్యే ఎన్నికలకు అవసరమైన అన్ని ఏర్పాట్లను డివిజనల్ ప్రిసైడింగ్ ఆఫీసర్ యు.సుధాకర్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్ జయశంకర్ చౌహాన్ పూర్తి చేశారు. డివిజన్ వ్యాప్తంగా దాదాపు 34 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా గట్టి బందోబస్తుతో పాటు 185 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. డివిజన్ వ్యాప్తంగా 14,453 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఎన్నికల విధులు నిర్వర్తించే సిబ్బందితోపాటు రన్నింగ్ స్టాఫ్, టిక్కెట్ చెకింగ్, రక్షణ విభాగంలో సిబ్బంది ఈ నెల 6వ తేదీ సాయంత్రం 6 గంటల్లోపు పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవచ్చు. కాగా, విజయంపై దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా

రేపు హిందువుల నిరసన ర్యాలీ

అనంతపురం కల్చరల్: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దారుణ మారణకాండను వ్యతిరేకిస్తూ ఈనెల 4వ తేదీన సాయంత్రం 5 గంటలకు నిరసన ర్యాలీ చేపట్టనున్నట్లు పలు హిందుత్వ సంస్థల ప్రతినిధులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక టవర్‌క్లాక్ నుంచి మునిసిపల్ కార్యాలయం వరకూ జరిగే ర్యాలీలో హిందువులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

స్కాలర్‌షిప్ అందించేందుకు విరాళం



జేఎన్‌టీయూ(ఏ) ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ హెచ్.సుదర్శన రావుకు చెక్కు అందజేస్తున్న పూర్వ విద్యార్థి శ్రీరామచంద్ర దంపతులు

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాలలో మెకానికల్, కంప్యూటర్ సైన్సెస్ చదువుతున్న 5 మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందించాలని పూర్వ విద్యార్థులు కోరారు. 1970 బ్యాచ్ ఇంజినీరింగ్ పూర్తి చేసిన ఎస్.శ్రీరామచంద్ర రూ.రెండు లక్షల చెక్కును ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ హెచ్.సుదర్శన రావుకు అందజేశారు. మెకానికల్ ఇంజినీరింగ్ విభాగంలో ప్రతిభావంతులైన ఒక అబ్బాయి, ఒక అమ్మాయికి ఈ మొత్తాన్ని అందజేయాలని కోరారు. అలాగే కొప్పర్తి విజయభాస్కర్ (హెచ్ఎంటీ మాజీ రిటైర్డ్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్) రూ.3 లక్షల చెక్కును అందజేశారు. కంప్యూటర్ సైన్సెస్ విభాగంలో ప్రతిభ చాటే ఒక అబ్బాయి, ఇద్దరు అమ్మాయిలకు ఈ మొత్తాన్ని అందించాలని విన్నవించారు.

వివాహిత అదృశ్యం

అనంతపురం: నగరంలోని ముత్యాలమ్మ కాలనీకి చెందిన వెన్నెల (26) అదృశ్యం అయినట్లు త్రీ టౌన్ సీఐ కె.శాంతిలాల్ తెలిపారు. గత నెల 20వ తేదీన వెన్నెల తన పిల్లలు అయిన ప్రదీప్, అక్షరతో కలసి పుట్టింటికి వెళ్లింది. రెండు రోజుల క్రితం పిల్లలతో పాటు వెన్నెల అదృశ్యమైందని భర్త మనోహర్ తెలిపాడు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

ఇళ్ల పట్టాలు ఇవ్వాలి



ఆర్డీఓ కేశవనాయుడుకు వినతిపత్రం అందిస్తున్న సీపీఐ నాయకులు

అనంతపురం రూరల్: అర్హులైన వారందరికీ ఇంటి పట్టాలు ఇవ్వాలని సీపీఐ నగర కార్యదర్శి శ్రీరాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పేదలకు ఇంటి పట్టాలను ఇవ్వాలని కోరుతూ సోమవారం ఆర్డీఓ కార్యాలయం ఎదుట సీపీఐ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ నగర కార్యదర్శి శ్రీరాములు మాట్లాడుతూ.. నగరంలో ఎంతో మంది నిరుపేదలు సొంత ఇళ్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఉప్పరపల్లి సర్వే నంబర్ 194–8లో గుడిసెలు వేసుకున్న పేదలకు ఇళ్ల పట్టాలు మంజూరు చేసి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీఓ కేశవనాయుడుకు వినతి ప్రతం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు అల్లీపీరా, సంతోష్ కుమార్, ఖాజాహుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

ఫుడ్‌సేఫ్టీ అధికారుల దాడి



పాతూరులో తినుబండారాలను పరిశీలిస్తున్న ఫుడ్‌సేఫ్టీ అధికారులు, పోలీసులు

అనంతపురం: విద్యార్థులకు నాణ్యత లేని తినుబండారాలు విక్రయిస్తున్నారంటూ పలువురు సోమవారం ఎస్పీ పి.జగదీష్‌కు వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఎస్పీ తనిఖీలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నగరంలోని పాతూరులో పోలీసులు, ఫుడ్‌సేఫ్టీ అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. గాంధీ బజార్, తాడిపత్రి బస్టాండ్, తదితర ప్రాంతాల్లో బృందాలు తనిఖీలు చేపట్టాయి. చిన్న పిల్లలు అధికంగా తినే కుర్ కురే, తదితర ప్యాకెట్లను పరిశీలించారు. లైసెన్స్ లేదా రిజిస్ట్రేషన్ లేకుంటే అలాంటి దుకాణాల యజమానులకు నోటీసులు జారీ చేస్తామని హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్‌కు గాయాలు

అనంతపురం: విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగంలో పని చేస్తున్న చలం అనే హెడ్‌కానిస్టేబుల్‌కు తీవ్రగాయాలు అయ్యాయి. సోమవారం ఉదయం హౌసింగ్ బోర్డు నుంచి జేఎన్‌టీయూ అనంతపురం వైపు బైక్‌లో బయలుదేరాడు. ఈయన ప్రయాణిస్తున్న వాహనాన్ని కారు ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. వెంటనే చికిత్స అందించేందుకు ఆసుపత్రికి తరలించారు.

తల్లిలా లాలిస్తూ.. విద్యాబుద్ధులు నేర్పిస్తూ



వారందరూ బుద్ధిమాంధ్యపు పిల్లలు.. ఎలా మాట్లాడాలో... ఏమి అనాలో కూడా తెలియని వారు. అలాంటి వారిని అర్థం చేసుకుని బుద్ధి వికసింప చేయడం కష్టతరం. అలాంటిది ఏకంగా 50 మంది పిల్లలకు అక్కడ మహిళలు తల్లి పాత్ర పోషిస్తూ పెంచుతున్నారు. ఇది జిల్లా కేంద్రంలోని రాస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సాగుతున్న మానసిక వికాలంగుల పాఠశాలలో రోజూ కనిపించే సన్నివేశాలే. మూడు దశాబ్దాలకు పైగా ఏమాత్రం ప్రచారార్భాటానికి పోకుండా దివ్యాంగులకు అండగా నిలిచిన ‘రాస్’ పనితీరుపై ప్రపంచ వికలాంగుల దినోత్సవం సందర్భంగా ‘సాక్షి’ ప్రత్యేక కథనం.

సందర్భం: నేడు ప్రపంచ వికలాంగుల దినోత్సవం

• స్ఫూర్తిదాయక సేవలందిస్తున్న రాస్ సంస్థ

అనంతపురం కల్చరల్: సామాజిక సేవా కార్యకర్త గుత్తా మునిరత్నం 1981లో తిరుపతి వేదికగా రాస్ (రాష్ట్రీయ సేవా సమితి) స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేశారు. కేవలం మానసిక వైకల్యంతో బాధపడుతున్న పిల్లలకు ఆశ్రయం కల్పించడానికి ఆయన చేసిన కృషి నేడు విస్తృతమై రాష్ట్రంలోని వివిధ జిల్లాలతో పాటు పొరుగు రాష్ట్రాలకూ విస్తరించింది. ఈ క్రమంలోనే 1992లో అనంతపురంలోని రామనగర్‌లో రాస్ శాఖ ప్రారంభమైంది. ఇప్పటి వరకూ వందలాది మంది దివ్యాంగులకు ఆలంబనగా నిలిచింది. వైకల్యపు స్థాయిని బట్టి చిన్నారులను మైల్డ్, మోడరేట్, సివియర్, ప్రొఫౌండ్ అనే విభాగాలుగా విభజించి, వారిలో వ్యక్తిత్వ నిర్మాణమే లక్ష్యంగా రాస్‌లో పనిచేస్తున్న టీచర్లు స్ఫూర్తిదాయక సేవలు అందిస్తున్నారు.

ఏమి నేర్పిస్తారు?

అసలు మాట్లాడలేకపోయే దశ మొదలు... శబ్దాలు వెలువరించే 3 ఏళ్ల నుంచి 21 ఏళ్ల వరకు మానసిక దివ్యాంగులకు రాస్ సంస్థ ఆశ్రయం కల్పించి శిక్షణనిస్తుంది. వయసుతో సంబంధం లేకుండా కేర్ గ్రూప్, ప్రైమరీ గ్రూప్, సెకండరీ గ్రూప్‌గా వారి స్థాయిని బట్టి వేర్వేరుగా విభజించి శిక్షణ ఇస్తుంటారు. వస్తువులను గుర్తించడం, ఇతరులతో ఎలా మాట్లాడాలో నేర్పించడం, శుచి... శుభ్రత మొదటి ప్రాధాన్యత అంశంగా ఉంటాయి. రోజుకొకటి చొప్పున యోగా, డ్రాయింగ్, గేమ్స్, మ్యూజిక్, భజన, గార్డెనింగ్‌తో పాటూ పార్కులకు తీసుకెళ్లి వారిలో చైతన్యం తీసుకువచ్చే ప్రయత్నం చేస్తుంటారు.



విద్యా బోధన చేసే టీచర్లు వీరే..

అలా బుద్ధి వికసింపజేసి ఓపెన్ స్కూల్ ద్వారా 10వ తరగతి, ఇంటర్ విద్యాభ్యాసం పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. ఏ మాత్రం ఫీజు లేకుండా మానసిక వికలాంగులను చేర్చుకుంటారు. సేవాభావం కలిగినమానవతా మూర్తుల సాయంతో రాస్ పాఠశాల నడుస్తోందని నిర్వాహకులు చెబుతున్నారు.

ఎలా చేర్చుకుంటారు?

ప్రస్తుతం అనంతపురంలోని రాస్ శాఖలో 50 మందికి పైగా దివ్యాంగ చిన్నారులు ఉన్నారు. వివిధ కారణాల వల్ల మానసిక వైకల్యంతో జన్మించిన చిన్నారుల ఆరోగ్యం కోసం తల్లిదండ్రులు రూ.లక్షలు ఖర్చుపెడుతున్నా ఫలితం లేని ఘటనలు చాలానే ఉన్నాయి. అయితే ప్రత్యేక శిక్షణ కలిగిన ఉపాధ్యాయుల పర్యవేక్షణలో వారి బుద్ధి వికసించడానికి అవకాశముంటుందని తెలియకపోవడం బాధాకరం. రాస్ సంస్థ ‘అనంత’ శాఖలో ప్రస్తుతం ఆరుగురు మహిళా ఉపాధ్యాయులు ఉన్నారు. వీరంతా సాధారణ బీఈడీతో పాటూ ప్రత్యేకంగా ఐడీ (ఇంటలెక్చువల్ డిసెబిలిటీ) కోర్సు చేసినవారే. వీరితో పాటూ ప్రత్యేక శిక్షణ కలిగిన ఆయాలు కూడా తల్లుల పాత్ర పోషిస్తున్నారు. వీరందరికి ఏడాదికి ఒకసారి మాత్రమే జీతం అందుతుంది. అయినా సేవాభావంతో వారు విధులు నిర్వర్తిస్తూ వస్తున్నారు.

చిన్నారులకు చేయూతనివ్వండి



పూర్తి సేవాభావంతో పనిచేసే రాస్ సంస్థలో మధ్య తరగతి కుటుంబీకులే కాకుండా అనాథలెంతో మంది ఉన్నారు. విద్య వరకు మేము బోధించగలం. కానీ దివ్యాంగులైన చిన్నారులకు అన్ని రకాల వసతులు కల్పించలేం. కాబట్టే దయాగుణం కలిగిన వ్యక్తులు, సంస్థలు ఇక్కడి పరిస్థితి తెలుసుకుని చిన్నపాటి వసతులు కల్పిస్తున్నారు. పుట్టినరోజులు, వివాహ సందర్భాలలో ఇక్కడి చిన్నారులకు ఆహార పదార్థాలను అందిస్తుంటే వారి కళ్లలో చెప్పలేని ఆనందం కనిపిస్తోంది. ఇది కూడా ఒక విధంగా వారిలో మానసిక పరిపక్వతకు దారి తీస్తుంది.

– ఫర్హానా, సూపర్‌వైజర్, రాస్ మానసిక పాఠశాల, అనంతపురం

కువైట్ ఖాదర్ బాషా మృతి బాధాకరం



ఖాదర్ బాషాకు నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్త కువైట్ ఖాదర్‌బాషా మృతి బాధాకరమని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఖాదర్ బాషా (58) సోమవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి మేయర్ వసీంతో కలసి రుద్రంపేటలో మృతుడి ఇంటికి వెళ్లి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యుల్లో ధైర్యం నింపారు. అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ.. ఖాదర్ బాషా మొదటి నుంచి పార్టీలో ఎంతో ఉత్సాహంగా పాల్గొనేవారన్నారు. అందరితో కలసి మెలసి ఉండే వారని గుర్తు చేశారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటు అన్నారు. వారి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైఫుల్లాబేగ్, పార్టీ నగరాధ్యక్షుడు చింతా సోమశేఖర్ రెడ్డి, నాయకులు రాధాకృష్ణ, అమర్‌నాథ్ రెడ్డి, గుల్జార్‌పేట గఫూర్ పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా తదితరులు

మాజీ డిప్యూటీ సీఎం నివాళులు

సామాన్య కార్యకర్త మృతి విషయం తెలుసుకున్న మాజీ డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా అనంతపురం వచ్చారు. రుద్రంపేటలోకి ఖాదర్‌బాషా ఇంటికి వెళ్లి నివాళులర్పించారు. ఖాదర్‌బాషా ఆత్మకు శాంతి చేకూరాలన్నారు. మాజీ డిప్యూటీ సీఎం వెంట డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి, వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, వైఎస్సార్‌సీపీ మైనార్టీ నాయకులు ఖాజా ఉన్నారు.

టీడీపీ నాయకులపై చర్యలు తీసుకోండి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రాప్తాడు: నా భూమిని టీడీపీ నాయకులు లాక్కొనేందుకు చూస్తున్నారు.. న్యాయం చేయకపోతే తహసీల్దార్ కార్యాలయం ముందే ఆందోళనకు దిగుతానని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, రైతు సంఘం జిల్లా మాజీ నాయకుడు పాలవాయి లక్ష్మీనారాయణ తెలిపారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల ప్రజా వేదికలో తహసీల్దార్ విజయకుమారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1993 సంవత్సరంలో మరూరు గ్రామ పొలంలో సర్వే నెంబర్ 403–3లో 4 ఎకరాల భూమికి ప్రభుత్వం పట్టా ఇచ్చిందని తెలిపారు. పట్టా ఇచ్చినప్పుడు ఆ పొలం రాళ్ల గుట్టగా ఉండటంతో సేద్యం చేసేందుకు ఇబ్బందిగా ఉండేదన్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు దాదాపుగా రూ.15 లక్షలకు పైగా ఖర్చు చేసి గుట్టలు తొలగించి వ్యవసాయం చేసుకుంటున్నట్లు పేర్కొన్నాడు. ప్రస్తుతం ఆ పొలంలో వేరుశనగ సాగు చేశానని తెలిపారు. నా పొలం పక్కనే మరూరుకు చెందిన నారమ్మకు 3.60 ఎకరాలు, శివయ్యకు నాలుగు ఎకరాల పొలం ఇవ్వడం జరిగిందన్నారు. శివయ్య అప్పటి నుంచి ఇప్పటి వరకు ఏనాడు పొలం దగ్గరకు రాలేదన్నారు. శివయ్య పొలంలో గుట్టలు ఉండటం, మరో పక్క టీడీపీ నేత కావడంతో నేను సాగు చేసుకుంటున్న పొలాన్ని ఎలాగైనా బలవంతంగా చేజిక్కించుకోవాలని సర్వే చేయించినట్లు తెలిపాడు. భూమిని లాక్కోనేందుకు పథకం రచించాడన్నారు. ఆ రోజు నాకు కొలతలు వేసి హద్దులు చూపించిన పొలంలోనే బోరు బావి తవ్వించి, మోటరు, పైపులు ఏర్పాటు చేసుకుని పంటలు సాగు చేసుకుంటున్నానని తెలిపారు. ప్రసుత్తం శివయ్య తన పొలాన్ని జయరాములు అనే వ్యక్తికి రూ.12 లక్షలకు విక్రయించడం జరిగిందని.. అతను సరిహద్దులు చూపడానికి రాగా నా పొలంలో 2 ఎకరాలు శివయ్యకు పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. గత 30 సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్న భూమిని ఇప్పుడు లాక్కొనేందుకు వస్తే తహసీల్దార్ కార్యాలయం ముందే ఆందోళనకు దిగుతానని హెచ్చరించారు. ఈయనకు వైస్ ఎంపీపీ బోయ రామాంజినేయులు, వైసీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, నాయకులు మన్నల రవికుమార్ మద్దతు పలికారు. లక్ష్మీనారాయణకు అన్యాయం జరిగితే తమ పార్టీ తరఫున ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం కార్పొరేషన్: ప్రతి కార్యకర్తకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం అనంత వెంకటరామిరెడ్డిని ఆయన నివాసంలో సోషల్ మీడియా నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అనంత మాట్లాడుతూ.. అక్రమ కేసులు, అరెస్టులకు ఎవరూ భయపడాల్సిన పని లేదన్నారు. న్యాయ పోరాటం చేసేందుకు లీగల్ బృందం ఉందన్న విషయాన్ని తెలియజేశారు. ప్రతి నియోజకవర్గంలో ప్రత్యేక టీంలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్యం తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఐటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి, సోషల్ మీడియా నాయకులు శ్రావణ్ రెడ్డి, రాకేష్, సాయి, శరణ్, తదితరులు పాల్గొన్నారు.

‘అనంత’తో మాజీ డిప్యూటీ సీఎం భేటీ

అనంతపురం కార్పొరేషన్: జిల్లాకు విచ్చేసిన మాజీ డిప్యూటీ సీఎం అంజాద్ బాషా సోమవారం వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులు, తదితర విషయాలపై చర్చించారు. కార్యక్రమంలో వక్ఫ్ బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సాకే చంద్రశేఖర్, మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైఫుల్లాబేగ్, నాయకులు జావెద్ పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకపోతే చర్యలు



రికార్డులను తనిఖీ చేస్తున్న సీఐ టీ.వీ.శ్రీహర్ష

రాప్తాడు: రోడ్డు నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు తప్పవని సీఐ టీ.వీ.శ్రీహర్ష హెచ్చరించారు. సోమవారం స్థానిక 44వ జాతీయ రహదారిపై నాలుగు రోడ్ల కూడలి వద్ద రోడ్డు ప్రమాదాల నివారణపై ద్విచక్ర వాహనదారులు, ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. డ్రైవర్ల అజాగ్రత్తతో ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. డ్రైవర్లు మద్యం సేవించి వాహనాలను నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలకు గురవుతారని తెలిపారు. అనవసరంగా ప్రాణాలను పోగొట్టుకుని కుటుంబ సభ్యులను అనాథలను చేయవద్దని సూచించారు. ముఖ్యంగా ఆటో, జీపుల డ్రైవర్లు తమ వాహనాల్లో కుటుంబ సభ్యుల ఫొటోలను విధిగా పెట్టుకోవాలన్నారు. ఆటోలో డ్రైవర్ కుడి వైపు తప్పకుండా కడ్డీలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఆటోపై క్యారీని తీసివేయాలని తెలిపారు. ఆటో వెనుక వైపు ఎవరినీ కూర్చోపెట్టకుండా డోర్‌లాక్ చేసుకోవాలని తెలిపారు. సెల్‌ఫోన్‌లో మాట్లడుకుంటూ వాహనాలను నడపరాదని హెచ్చరించారు. డ్రైవర్లు రోడ్డు భద్రత నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు తప్పవన్నారు. ప్రతి ఒక్కరూ విధిగా రోడ్డు నిబంధనలు పాటించాలని తెలిపారు. యూనిఫాం ధరించాలన్నారు.

భక్తిశ్రద్ధలతో పొలి పాడ్యమి



పండమేరు వంకలో పూజలు చేస్తున్న దంపతులు

రాప్తాడు: కార్తీక మాసం ముగియడంతో సోమవారం మార్గశిర మాసం ప్రారంభమైంది. కార్తీక మాసంలో శైవ క్షేత్రాల్లో ప్రత్యేక పూజలు ఎలా జరిగాయో.. మార్గశిర మాసంలో కూడా వైష్ణవాలయాల్లో ప్రత్యేక పూజలు జరుగుతాయని అర్చకులు తెలిపారు. సోమవారం పొలి పాడ్యమి కావడంతో మండల వ్యాప్తంగా గ్రామీణ ప్రజలు వైష్ణవ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం పండమేరు వంక వద్దకు వెళ్లి దీపాలు వెలిగించారు. గంగమ్మ ఒడిలోకి దీపాలు వదిలి, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

జూడో పోటీల్లో ప్రతిభ



మెడల్స్ సాధించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

కనగానపల్లి: మండలంలోని మామిళ్లపల్లి కేకేఆర్ జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు జూడో పోటీల్లో ప్రతిభ కనబరచారు. ఇటీవల ఆర్డీటీ ఆధ్వర్యంలో నిర్వహించిన జోనల్ స్థాయి జూడో పోటీల్లో పాఠశాలకు చెందిన 12 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు పాఠశాల పీడీ శివారెడ్డి తెలిపారు. 11 మంది సిల్వర్, ఒకరు గోల్డ్ మెడల్ సాధించారని పేర్కొన్నారు. సోమవారం స్థానిక పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో జూడో పోటీల్లో రాణించిన విద్యార్థులు, పీడీని పాఠశాల హెచ్ఎం స్నేహలత, ఉపాధ్యాయులు అభినందించారు.

హెచ్ఎం సస్పెన్షన్ సబబు కాదు : ఎస్టీయూ

అనంతపురం ఎడ్యుకేషన్: మడకశిర మండలం ఆమిదాలగొంది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిని సస్పెండ్ చేయడం సబబు కాదని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) నాయకులు మండిపడ్డారు. ఈ మేరకు ఆ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమణారెడ్డి, రామాంజనేయులు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 8వ తరగతి విద్యార్థి చేతన్‌ను పాఠశాల విరామ సమయంలో బంధువు వచ్చి పిలుచుకెళ్లాడని పేర్కొన్నారు. ఆ తర్వాత చేతన్ దారుణహత్యకు గురికావడం అత్యంత బాధాకరమన్నారు. అయితే ఎలాంటి సంబంధం లేని పాఠశాల హెచ్ఎంను సస్పెండ్ చేయడం ఎంత వరకు సబబని ప్రశ్నించారు. విరామ సమయంలో విద్యార్థి మేనమామ వచ్చి బాలుడి ఇష్టపూర్వకంగా, ఎలాంటి ప్రతిఘటన లేకుండా పిలుచుకెళ్తే టీచర్లు ఎలా బాధ్యులవుతారన్నారు. 438 మంది విద్యార్థులున్న పాఠశాలకు కనీస బోధనేతర సిబ్బంది ఒకరూ లేకపోవడం, అన్ని పనులూ హెచ్ఎం, ఉపాధ్యాయులే చేసుకుంటుండడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు. ఇటీవల ఆపార్ అప్‌డేషన్ టార్గెట్ పెట్టడంతో హెచ్ఎం, టీచర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పదో తరగతి నామినల్ రోల్స్ పని ఒత్తిడిలోనూ ఉన్నారన్నారు. ఈ విషయాలన్నింటినీ దృష్టిలో పెట్టుకుని ఆమిదాలగొంది స్కూల్ హెచ్ఎం సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. పీఈటీకి ఇచ్చిన షోకాజ్ నోటీసును ఉపసంహరించుకోవాలని కోరారు.

వక్ఫ్ బోర్డు రద్దు సరికాదు



మాట్లాడుతున్న మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్/అనంతపురం కల్చరల్: వక్ఫ్ బోర్డు గడువు ఇంకా ఉండగానే ప్రభుత్వం రద్దు చేయడం సబబు కాదని నగర మేయర్ మండిపడ్డారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. నారా చంద్రబాబు నాయుడుకు ముందు నుంచి ముస్లింలపై చిన్నచూపు ఉందని గుర్తు చేశారు. జీఓ నంబర్ 47ను రద్దు చేయడం అభ్యంతరకరమని ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. ముస్లిం వ్యతిరేక విధానాలను మానుకోకపోతే ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు. రానున్న రోజుల్లో మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. రాజకీయ కుట్రలో భాగంగానే వక్ఫ్ బోర్డు కమిటీని రద్దు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2014 నుంచి 2018 వరకూ బాబు హయాంలో అసలు వక్ఫ్ బోర్డునే నియమించలేదని గుర్తు చేశారు. 2018లో ఆయన వక్ఫ్ బోర్డు కమిటీని నియమిస్తే.. జగన్ మోహన్‌రెడ్డి తన పాలనలో కూడా కొనసాగించారని తెలిపారు. మరి 2023లో ఏర్పాటు చేసిన కమిటీని ఎలా రద్దు చేస్తారని ప్రశ్నించారు. ముస్లిం వ్యతిరేక విధానాలను మార్చుకోవాలని సూచించారు.

చిన్నారులతో ఎస్పీ మమేకం



చిన్నారులతో ఎస్పీ పి.జగదీష్

అనంతపురం: పోలీస్ ప్రీ ప్రైమరీ స్కూల్ చిన్నారులతో ఎస్పీ పి.జగదీష్ సోమవారం సరదాగా ముచ్చటించారు. గత నెలలో ఎస్పీ దంపతులు చిల్డ్రన్స్‌డేను విజయవంతంగా నిర్వహించిన విషయం తెలిసిందే. కార్యక్రమ నిర్వహణకు ఎస్పీ దంపతులు ప్రత్యేక చొరవ తీసుకోవడంతో.. ఎస్పీకి అభినందనలు తెలిపేందుకు చిన్నారులు వచ్చారు. తన హోదాను మరచిన ఎస్పీ.. చిన్నారులతో మమేకమయ్యారు. వారితో సరదాగా గడిపారు. అనంతరం చిన్నారులకు చాక్లెట్లు పంచిపెట్టారు.

ముందస్తు అడ్మిషన్లు అరికట్టాలి



ఆర్ఐఓ వెంకటరమణ నాయక్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: ఇంటర్ అడ్మిషన్ల కోసం ఈనెల 8న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్న విశ్వంభర కళాశాలపై చర్యలు తీసుకోవాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఇంటర్ బోర్డు ఆర్ఐఓ వెంకటరమణ నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సిద్దు, కార్యదర్శి ఓతూరు పరమేష్ మాట్లాడుతూ.. నిబంధనలకు విరుద్ధంగా నగరంలోని విశ్వంభర కళాశాలలో ఈనెల 8న ప్రవేశ పరీక్ష నిర్వహించేందుకు విద్యార్థుల నుంచి డబ్బు వసూలు చేస్తున్నారన్నారు. మరోవైపు నారాయణ విద్యా సంస్థలు 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రవేశాలను ముందస్తుగా చేపడుతున్నారన్నారు. పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్నా వాటిపై శ్రద్ధ చూపకుండా వచ్చే ఏడాదికి సంబంధించి అడ్మిషన్ల కోసం విద్యార్థులు, తల్లిదండ్రులపై ఒత్తిడి చేస్తున్నారని వాపోయారు. అధికారులు స్పందించి ఈ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రమాదాల నియంత్రణకు ‘ఫేస్ వాష్ అండ్ గో’



ముఖం కడుక్కుంటున్న డ్రైవర్

అనంతపురం: టోల్‌ప్లాజాలు, బ్లాక్‌స్పాట్‌ల వద్ద సోమవారం తెల్లవారుజాము నుంచే ఫేస్ వాష్ అండ్ గో కార్యక్రమాన్ని జిల్లా పోలీసులు నిర్వహించారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణ ధ్యేయంగా.. జిల్లా పరిధిలోని ప్రతి టోల్‌గేట్ వద్ద కార్యక్రమాన్ని చేపట్టారు. లారీలు, బస్సులు, వ్యాన్లు, కార్లు తదితర వాహనాలను నిలిపి డ్రైవర్లను ముఖం కడుక్కోవాలని సూచించారు. కొంచెం టీ తాగి, వాహనాలను జాగ్రత్తగా నడపాలని ఆదేశించారు.